# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-02-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలోని టిడ్కో కాలనీలలో రామాలయాలను నిర్మిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.**
2. **గుణదల మేరీ మాత ఉత్సవాలు ఈరోజు ప్రారంభమయ్యాయి.**
3. **సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు, కొన్నింటిని దారి మళ్లించినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.**
4. **కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు.**

===========================

రాష్ట్రంలోని టిడ్కో కాలనీలలో రామాలయాలను నిర్మిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని టిడ్కో కాలనీలో రామాలయ నిర్మాణానికి ఈ రోజు రాష్ట్ర మంత్రులు పి. నారాయణ, ఎన్ ఎం డి ఫరూక్, ఎస్. సవిత, బి.సి.జనార్దన్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఏ.పి.టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. అన్ని టిడ్కో కాలనీలలో ఆలయాలను నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారని మంత్రి రామనారాయణ రెడ్డి వెల్లడించారు. అనంతరం ఆత్మకూరులో నూతనంగా నిర్మించిన ఆర్.అండ్.బి.అతిథి గృహాన్ని మంత్రి జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతి రావు పూలే బాలికల గురుకుల పాఠశాలను మంత్రి సవిత ప్రారంభించారు.

-------------------------

దక్షిణ భారతదేశంలో ప్రాధాన్యత సంతరించుకున్న గుణదల మేరీ మాత ఉత్సవాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలను విజయవాడ కేథలిక్ పీఠాధిపతి బిషప్ జోసఫ్ రాజారావు సమష్టి దివ్య బలి పూజతో ప్రారంభించారు. దేశం నలుమూలల నుంచి తిరుణాళ్ల మహోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనే అవకాశం ఉందని బిషప్ తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీస్ పరంగా అన్ని భద్రత చర్యలు చేపట్టినట్లు విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు తెలిపారు. మూడు రోజుల పాటు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని అన్నారు. కోల్ కత్తా –చెన్నై జాతీయ రహదారికి దగ్గరలోనే గుణదల కొండ ప్రాంతం ఉండటంతో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు

తీసుకున్నట్లు తెలిపారు.

---------------------------

సౌర విద్యుత్తుతో నెలవారీ కరెంట్ బిల్లులు తగ్గించవచ్చని ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.చంద్రశేఖర్ తెలిపారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై అవగాహనా కార్యక్రమం రెండవరోజైన ఈరోజు పలు బ్యాంకులు ఈ పథకంపై ఇచ్చే రాయితీని వివరిస్తూ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ... ఈ పథకం ద్వారా వినియోగదారులకు నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ లభిస్తుందని, అదనంగా ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను విక్రయించడం ద్వారా సంవత్సరానికి 18 వేల రూపాయల వరకు సంపాదించవచ్చని వివరించారు.

---------------------------

అన్ని వయసుల వారు తప్పనిసరిగా యోగా, ధ్యానం, వ్యాయామం అలవాటు చేసుకోవాలని తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు సూచించారు. ఈరోజు ఆయన తిరుపతిలోని మహతి ఆడిటోరియం నుంచి స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో యోగా, ధ్యానంపై అవగాహన కల్పించడానికి నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ....

..వాయిస్ .. 25 సెకన్లు

---------------------------

విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల శ్రీకాకుళం జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. ఈసారి వినూత్న ఆలోచనలకు అనుగుణంగా ప్రధాన మంత్రితో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం నింపేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేయడం ప్రశంసనీయం అన్నారు.

---------------------------

పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి, ఉన్నతంగా రాణించడానికి, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న పరీక్ష పే చర్చా కార్యక్రమం, మంచి సత్ఫలితాలను ఇస్తోందని చిత్తూరు జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు అధికారి మద్దిపట్ల వెంకటరమణ తెలిపారు.సోమవారం దేశవ్యాప్తంగా ప్రసారం కానున్న పరీక్ష పే చర్చా కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, ఈ కార్యక్రమాన్ని వీక్షించడం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తారని పేర్కొంటూ..

...వాయిస్.. 36 సెకన్లు

---------------------------

సికింద్రాబాద్ డివిజన్ పరిధి కాజీపేట– విజయవాడ సెక్షన్‌లో జరుగుతున్న భద్రతాపరమైన పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు, కొన్నింటిని దారి మళ్లించి నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. రేపటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు విశాఖపట్నం –

ఎల్‌టీటీ, 12 నుంచి 22 వరకు ఎల్‌టీటీ–విశాఖపట్నం, 13న టాటానగర్–యశ్వంత్‌పూర్, ఈరోజు, ఈ నెల 16న యశ్వంత్‌పూర్– టాటానగర్ రైళ్లను రద్దు చేయగా ఈ నెల 19,20 తేదీల్లో విశాఖపట్నం– సికింద్రాబాద్ వందేభారత్ రైలు ఉదయం 5 గంటల 45 నిమిషాలకు బదులుగా 7 గంటలకు బయలుదేరేలా సమయం మార్పు చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

---------------------------

ఏలూరు జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని బోర్డ్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.యోహాన్ తెలిపారు. ఏలూరు నగరంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రెండవ ఏడాది చదువుతున్న సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు రేపటినుండి నిర్వహిస్తామని అన్నారు. జిల్లాలో 33 వేల 511 మంది విద్యార్థులకు గాను 55 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలలో మాస్ కాపీయంగ్ జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసామని వివరించారు.

---------------------------

కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. అనంతపురంలో ఈరోజు అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరు చేసిన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు పాత్రికేయులతో మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని, 8వ విడత సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీలో భాగంగా 9 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించినట్లు చెబుతూ..

వాయిస్.. 22 సెకన్లు...

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం రోజునే అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా 1 నుంచి 5వ తరగతులకు సంబంధించిన పుస్తకాల ముద్రణను విద్యాశాఖ ప్రారంభించింది. ఏప్రిల్ చివరి నాటికి పాఠ్యపుస్తకాలను జిల్లా కేంద్రాలకు తరలించి, మే చివరి నాటికి బడులకు చేర్చాలనే లక్ష్యంతో ఇప్పుడు చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 34 లక్షల 36 వేల మందికి పుస్తకాలను అందించేందుకు విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 26 సెకన్లు....

======================